క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలి



వంగర : మిల్లర్లతో సమీక్షిస్తున్న తహసీల్దార్

వంగర: రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో పారదర్శకత పాటించాలని తహసీల్దార్ డి.ధర్మరాజు మిల్లర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైస్ మిల్లర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు విధివిధానాలు, గోనె సంచుల సరఫరా, బ్యాంకు గ్యారంటీ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీటీ పిన్నింటి రామారావు, మిల్లర్లు పాల్గొన్నారు.

జీసీఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



ప్రథమస్థానంలో నిలిచిన జట్టుతో ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల పురుషుల వాలీబాల్ జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమ్ శుక్రవారం తెలిపారు. పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించారు. ఈ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని 18 కళాశాలలు పాల్గొన్నాయని అన్నారు. వీరిలో కళాశాల వాలీబాల్ జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకోవడంతో ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ కేశవనారాయణ రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రకుమార్ అభినందించారు.

ఆక్రమణ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బొబ్బిలి: పట్టణంలో మిలటరీ కాలనీ సమీపంలోని చెరువు ప్రాంతాన్ని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుంటున్న విషయాన్ని ప్రజాసంఘాల నాయకుల ద్వారా తెలుసుకున్న తహసీల్దార్ ఎం.శ్రీను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. చెరువు ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్న బీఎస్ఆర్ ప్రాపర్టీస్ అని తెలుసుకుని సంబంధిత వ్యక్తులను పిలిపించి హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ చెరువు ప్రాంతాన్ని కప్పేందుకు మరో చెరువు నుంచి గ్రావెల్‌ను తీసుకు రావడం వంటి అంశాలపై తహసీల్దార్ రియల్ వ్యాపారి బురిడి శంకరరావుపై సీరియస్ అయ్యారు. మట్టిని వెంటనే తొలగించాలని మరో పక్క వాల్టా చట్టంపై నోటీసులు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై ఆర్ఐ రామ్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఇప్పుడే వరి చేను కోతలు వద్దు..



రేగిడి : తునివాడలో వరి పంటలు పరిశీలిస్తున్న ఏఓ

రేగిడి: దానా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, రైతులు ప్రస్తుతం వరికోతలు చేయవద్దని వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలో తునివాడ, వెంకమ్మపేట, కందిశ తదితర గ్రామాల్లో పర్యటించి, రైతులకు అవగాహన కల్పించారు. తుఫాన్ ప్రభావం తగ్గిన తరువాత కోతలు చేయాలని అన్నారు.

రైతుల్లో తుఫాన్ గుబులు

బాడంగి: దానా తుఫాన్ ప్రభావం జిల్లాలో ఉండొచ్చన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి చేలు కోత దశకు వచ్చిన సమయంలో తుఫాన్ ప్రభావం చూపితే తీవ్ర నష్టం తప్పదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శంగా నిలవాలి

సంతకవిటి: విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతంగా నిలిచి నలుగురికి ఆదర్శంగా నిలవాలని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ అన్నారు. మండలంలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని, మహాత్ముల జీవిత చరిత్రలు చదివి అంతే ధైర్యంతో ముందుకు సాగాలని అన్నారు. మనిషి ఉన్నత స్థితికి చేరుకోవడానికి పేదరికం ఏమాత్రం అడ్డుకాదని అన్నారు. బలమైన సంకల్పంతో మంచి లక్ష్యాలను ఏర్పరుచుకొని నిరంతర శ్రమతో ధైర్యంతో విజయాలను సాధించి నలుగురికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉరిటి రవిశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గడే అప్పలనాయుడు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- అమలు కాని కూటమి హామీ
- రాజాం రహదారి విస్తరణలో మీనమేషాలు
- ఎన్నికల ముందు మూడు నెలల్లో పూర్తి చేస్తామంటూ వాగ్దానాలు
- నాలుగు నెలలు గడిచినా ముందుకు కదలని పనులు

హామీలు గాలికి.. దుమ్ము, ధూళి ప్రజలకు



అధ్వానంగా రాజాం ప్రధాన రహదారి

అప్పుడేమన్నారంటే..

మనం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చివరి నుంచి ఆ చివరి వరకూ ఈ రోడ్డును వెంటనే బీటీ నిర్మాణం చేస్తాం. ప్రయాణికులకు ఎటువంటి కష్టాలు లేకుండా చేస్తాం.
– రాజాంలో ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబునాయుడు

పోరాడి నిధులు తెస్తా...

అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రితో పోట్లాడి మరీ నిధులు తెస్తాం. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తాం. మేమంటే ఏమిటో చూపిస్తాం.
– ఎన్నికల ప్రచారంలో కూటమి రాజాం అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

కంటి వ్యాధులు వస్తున్నాయి..



రాజాం ప్రధాన రహదారిలో ప్రయాణం అంటేనే భయమేస్తుంది. కంటి వ్యాధులు వస్తున్నాయి. ఈ రోడ్డు వేగంగా బాగు చేయాల్సి ఉంది. లేకుంటే చాలా మంది ఆరోగ్యం నష్టపోయే ప్రమాదం ఉంది.
– పొట్నూరు స్వాతికుమార్, ప్రయాణికుడు, చింతలపేట

ఉత్తుత్తి హామీలే..



రాజాంలో ప్రధాన రహదారి విస్తరణలో ఈ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదు. గతంలో మా ప్రభుత్వం విడుదల చేసిన నిధులే కాంట్రాక్టర్‌కు అందాయి. రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తి చేయాలంటే కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయాలి. ఈ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు వేగవంతం చేయడం లేదు. కూటమి నేతల హామీలు ఉత్తుత్తి హామీలేనని ప్రజలకు తెలిసిపోయింది.
– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్ సీపీ రాజాం ఇన్‌చార్జ్

రాజాం: సీన్ కట్ చేస్తే... ప్రస్తుతం రాజాం ప్రధాన రహదారి పరమ అధ్వానంగా మారింది. రహదారిపై ద్విచక్ర వాహనం వెళ్లినా.. దుమ్ము, ధూళి పొగ మాదిరి ఎగిసి పడుతుంది. ప్రయాణికులను ప్రమాదాలకు గురి చేస్తోంది. ప్రయాణికులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారు. ఎక్కడికక్కడే రోడ్డులో గోతులు పెద్దగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు.

ఆ హామీలేమైనట్టు..

ఎన్నికల ముందు అంబేడ్కర్ సెంటర్‌కు సమీపంలో పాలకొండ రోడ్డులో చంద్రబాబునాయుడు బహిరంగ సమావేశం నిర్వహించారు. ఎన్నికల హామీల్లో భాగంగా రాజాం ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగవంతం చేస్తామని, పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేస్తామని అన్నారు. కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పట్టణంతో పాటు నాలుగు మండలాల్లో ప్రచారంలో కూడా రాజాం ప్రధాన రహదారి రోడ్డు బీటీ నిర్మాణం అధికారంలోకి వచ్చిన మూడు నెలలో పూర్తి చేయించే బాధ్యత తనదంటూ హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు కూడా ఈ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డు దుస్థితిని మరచిపోయారు. నాలుగు నెలలు గడిచినా రోడ్డు నిర్మాణ పనులు ముందుకు కదల్లేదు. రోడ్డు మొత్తం మరింత గోతులుగా మారింది. వర్షాలు పడితే నీటితో నిండి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాలు పడకుంటే దుమ్ము, ధూళి ఎగిసిపడి ప్రాణాంతక వ్యాధులు తెస్తున్నాయి. అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ, బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకూ 2 కిలోమీటర్లు మేర ప్రధాన రహదారిని విస్తరణ చేయాల్సి ఉంది. విస్తరణ పనుల్లో భాగంగా గత ప్రభుత్వం రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలు తొలగించి, అండర్ డ్రైనేజీ నిర్మాణాన్ని సైతం 90 శాతం మేర పూర్తి చేయించింది. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

నిధులు రాకపోవడంతోనే..

రాజాంలో గతంలో తొలి విడత పనుల్లో భాగంగా శ్రీకాకుళం రోడ్డు నుంచి బొబ్బిలి సెంటర్ మీదుగా పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వరకూ 1.70 కిలోమీటర్లు మేర బీటీ నిర్మాణంతో రోడ్డును 80 అడుగుల వెడల్పుతో విస్తరించారు. ఈ మేరకు రూ.12 కోట్లు నిధులు విడుదల చేసారు. రెండో విడతలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకూ, బొబ్బిలి సెంటర్ నుంచి గాయత్రీ కాలనీ వరకూ రహదారి విస్తరణ నిమిత్తం గత ప్రభుత్వం రూ.20 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు పనులు చేయగా, రూ.6.13 కోట్లు నిధులను గత ప్రభుత్వం విడుదల చేయగా, ఎన్నికల అనంతరం ఆ నిధులు కాంట్రాక్టర్‌కు అందాయి. ఈ నిధులు రాగానే కూటమి నేతలు స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌తో కలసి రోడ్డు విస్తరణ పనులు పునః ప్రారంభం కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం గతంలో కొలతలు నిర్ధారించిన ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణంలోనే ఉన్నారు.

ఏఈ ఏమన్నారంటే..

ఈ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఆర్అండ్‌బీ ఏఈ నాగభూషణ వద్ద సాక్షి ప్రస్తావించగా రహదారి పనులు పునః ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పాలకులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతానికి కృషి చేస్తున్నారని, మేం కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ జరిగిన పనులకు బిల్లుల వచ్చాయని, మరికొంత మేర నిధులు వస్తే పనులు వేగవంతం చేసేందుకు కాంట్రాక్టర్ చూస్తున్నారని అన్నారు.

సమగ్ర వ్యవసాయ విధానం అవసరం

- వ్యవసాయ శాఖ ఏడీ శ్యాంసుందర్



రైతు సేవా కేంద్రంలో శిక్షణలో మాట్లాడుతున్న ఏడీ

బొబ్బిలి రూరల్: రైతులు సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా ఏడాది కాలం పంటలను సాగు చేసుకుని ఆర్థిక లాభాలను పొందవచ్చని ఆ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందర్ అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటలకే రైతులు పరిమితవుతున్నారన్నారు. అవి కాకుండా పొలం గట్లపై కూరగాయల సాగు, అపరాల సాగు, కోళ్లు, పశువుల పెంపకం ద్వారా ఏడాది పొడవునా లాభాలను ఆర్జించవచ్చని వివరించారు. ఈ అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వరి పంటలకు సోకే చీడపీడల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి రైతులను భాగస్వాములను చేయాలని సూచించారు. పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏడీఏ చంద్రశేఖర్‌బాబు, డాట్‌సెంటర్ ప్రతినిధి తేజస్‌రావు తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

సచివాలయాలను సందర్శించిన ఎంపీడీఓలు



బాడంగి: బొత్సవానివలసలో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ



బొబ్బిలి రూరల్: కాశిందొరవలస సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

బాడంగి: మండలంలోని బొత్సవానివలస, పాల్తేరు సచివాలయాలను ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ శుక్రవారం సందర్శించారు. సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, హాజరు, పనితీరుపై ఆరా తీశారు. చెత్తతో సంపద సృష్టించే ఎస్‌డబ్ల్యూపీసీలను, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

బొబ్బిలి రూరల్: గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.రవికుమార్ హెచ్చరించారు. మండలంలోని కాశిందొరవలస సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు పట్టీ పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శిని సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లోని సిబ్బంది సొంత పనులను పురమాయించుకుని హాజరు వేసి వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇక ముందు ఇలాంటి ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని వాటర్‌ట్యాంకు వద్ద జరుగుతున్న క్లోరినేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు ఉన్నారు.

క్రైస్తవ సంఘాల ఆస్తులు అన్యాక్రాంతం

- సీబీసీఎన్‌సీ సంఘ నాయకులు

బొబ్బిలి: విశాఖ, భీమిలి, కాకినాడలతో పాటు బొబ్బిలిలో క్రైస్తవ మిషనరీ సంఘాల ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, వీటిపై కోర్టులను ఆశ్రయించనున్నట్టు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దీపక్ కుమార్, రాజ్‌కుమార్‌లు అన్నారు. స్థానిక సీబీఎం చర్చిలో విలేకర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ప్రమేయంతోనే ఈ అన్యాక్రాంతాలు అయ్యాయని ఆరోపించారు. సీబీసీఎన్‌సీ ఆస్తులను ఎవరూ విక్రయించరాదని, వాటిపై ఎవరికీ హక్కుల్లేవని ఉన్నత న్యాయస్థానం 2022లోనే తీర్పు ఇచ్చినా అన్యాక్రాంతాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రజలు కూడా బాధ్యతగా పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందని వారన్నారు. ఈ ఆస్తులను ఆయా సంఘాలకు బదలాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. చర్చి అధ్యక్షుడు వేణు, కార్యదర్శి అప్పారావు, కోశాధికారి భాస్కరరావు, డేవిడ్, జనార్దన్‌తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సిలిండర్లపై స్పష్టత ఏది..!



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీలు సునీత, వర్షిణి

రాజాం: ప్రభుత్వం ఇస్తామన్న సూపర్ సిక్స్ హామీలు అమలులో జాప్యం ఎందుకు జరుగుతోందని, ప్రజలను నమ్మించి మోసం చేయడం సబబు కాదని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వైస్ ఎంపీపీలు యాలాల సునీత, నక్క వర్షిణిలతో కలసి ఆమె విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. సూపర్ సిక్స్‌లో తల్లికి వందనం ఉందని, ఆ పథకాన్ని ఎందుకు అమలు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీపావళి పండగ నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఉందని అన్నారని, ఈ పథకంపై ఇంతవరకూ ప్రభుత్వం నుంచి క్లారిటీ లేకపోవడం, సివిల్ సప్లై అధికారులకు సమాచారం లేకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ప్రతీ మహిళకు నెలకు రూ.1500 నగదు సాయం ఇస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకం గురించి ప్రస్తావించకపోవడం ఆడపడుచులను మోసగించినట్టేనని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఈ సూపర్ సిక్స్ పథకాలు అమలు ప్రారంభించాలని, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు సంబంధించి గ్రామాల్లో అవగాహన కల్పించి, క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాంబాబు



పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఏ గ్రామంలోనైనా పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకొనేందుకు వెనుకాడేది లేదని ఎంపీడీఓ రేగి రాంబాబు అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. నవంబరు నెలకు సంబంధించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సాధ్యమైనంత వరకు ఒకటో తేదీని 100శాతం పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కోరారు. సమావేశంలో మండల ఈఓపీఆర్‌డీ నీలిమ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు విధిగా చేపట్టాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు, తాగునీరు పరీక్షలు, క్లోరినేషన్ తదితర అంశాలపై వివరించారు. అలాగే 2025 – 26 ఏడాదికి ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విత్తనాల కోసం ఎదురుచూపు

రేగిడి: రబీలో సాగుచేసే అపరాల పంటలు నిమిత్తం విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రబీలో ప్రధానంగా రేగిడి మండలంలో పెసర, మినప వంటి పంటలు అధికంగా సాగు చేస్తారు. ఆ విత్తనాలు ఈ సమయంలోనే పొలాల్లో వేయాల్సి ఉంది. గత ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలు ద్వారా అక్టోబర్ నెల పూర్తవ్వకముందే అపరాల విత్తనాలు రాయితీపై అందించేది. ఈ ఏడాది ఇంతవరకూ విత్తనాలు రాకపోవడంతో రైతులు అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులను, సిబ్బందిని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది.

శానిటేషన్ పరిశీలన

రాజాం: మండలంలో గురవాం గ్రామంలో శానిటేషన్ పనులను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పరిశీలించారు. శుక్రవారం గ్రామానికి చేరుకుని తొలుత సచివాలయంలో సేవలపై ఆరా తీసారు. అక్కడి నుంచి గ్రామంలోని పలు వీధుల్లో జరుగుతున్న శానిటేషన్‌ను పరిశీలించి, క్లాప్ మిత్రలతో మాట్లాడారు. ప్రజలకు అవగాహన కల్పించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ పనుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

వంగర: మండల పరిధి ఓనెఅగ్రహారం, వంగర, సంగాం తదితర గ్రామాల్లో విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టారు. ఏఈ సాంబశివరావు ఆధ్వర్యంలో ట్రాన్స్ సిబ్బంది విద్యుత్ లైన్లుకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలు, విద్యుత్ లైన్లు సరిచేయడం వంటి పనులు చేపట్టి విద్యుత్ సరఫరా చేశారు.

సప్తధాన్యంకుర కషాయంతో అధిక దిగుబడి

బొబ్బిలి రూరల్: వరి రైతులు తమ పంట పొలాల్లో సప్తధాన్యంకుర కషాయాన్ని పిచికారీ చేయడం వల్ల ధాన్యపు గింజ బరువుపెరిగి అధిక దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకర్రావు వివరించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని రైతులకు శుక్రవారం సప్తధాన్యంకుర కషాయం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు ,రైతులు పాల్గొన్నారు.

ఇటుకల వ్యాపారాలు వెలవెల

రేగిడి: మండలంలో ఇటుకల తయారీదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఐదు నెలలుగా ఎటువంటి వ్యాపారాలు లేవని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం భవన నిర్మాణాలు ఆగిపోయాయని, ప్రభుత్వ ఇండ్ల నిర్మాణాలు కూడా జరపడం లేదని మండలంలో కుమ్మరిఅగ్రహారం, ఉంగరాడ, చిన్నశిర్లాం, లచ్చనవలస, తాటిపాడు తదితర గ్రామాల్లోని ఇటుక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ ప్రాతిపదికన వేతనదారులను తెప్పించామని, లక్షల్లో ఇటుకలు తయారై ఉండిపోయాయని అన్నారు. ఎవరూ వీటిని కొనుగోలుచేయకపోవడంతో అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని, ప్రభుత్వం రాయితీ రుణాలు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించాలి



గుళ్లపాడు పాఠశాలలో విద్యార్థుల వద్ద వివరాలు సేకరిస్తున్న ఎంఈఓలు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేలని ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలో గుళ్లపాడు, ఉంగరాడ, వండానపేట తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసారు.

అయోడిన్ ఉప్పును వాడాలి..

వంగర: ఉప్పు వినియోగంలో గృహిణిలు జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజనిదుర్గ అన్నారు. మండలంలో మగ్గూరు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్తలు కళావతి, అప్పలనరసమ్మ తదితరులు ఉన్నారు

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: లక్ష్మీపురం గ్రామంలో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయడంతో పాటు క్లోరినేషన్ కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ కెంబూరీ వెంకటేశ్వరరావు సమక్షంలో బోర్ మెకానిక్‌లు వీటిని బాగు చేసారు.

సీజనల్ పనులపై అవగాహన

వంగర: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పలు రకాల పనులపై రైతులకు, వేతనదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలో కొప్పరవలస సచివాలయం వద్ద గ్రామంలోని ప్రజలకు మ్యాపింగ్ ద్వారా వివరాలను ఉపాధి ఏపీఓ మర్రాపు సత్యవతి వివరించారు. ఈసీ హరినారాయణ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రమాద రహిత దీపావళికి చర్యలు

రామభద్రపురం: ప్రమాదరహిత దీపావళికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ఎ.సులోచన రాణి అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో చురుగ్గా పారిశుద్ధ్య పనులు

తెర్లాం: ఎంపీడీఓ రాంబాబు, ఈఓపీఆర్‌డీ నీలిమ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు గత కొన్ని రోజులుగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం మండలలోని చినపాలవలస, రంగప్పవలస, కవిరాయునివలస తదితర గ్రామాల్లో వీధి కాలువల్లో పూడికతీ, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ పంచాయతీ కార్యదర్శులు చేయించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

రాజాం: గ్రామాల్లో రైతులకు భూ సమస్యలు లేకుండా ఉండేందుకు గ్రామ సదస్సులు పెడుతున్నామని తహసీల్దార్ ఎస్‌కే రాజు అన్నారు. దోసరి గ్రామంలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అడంగల్‌లో తప్పొప్పులను సరిచేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసీనాయుడు, ఎంపీటీసీ వాసు, రీసర్వే డీటీ అనంత్‌కుమార్, ఆర్ఐ విద్యాసాగర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద వేగావతిలో ఇసుకను అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో పెట్రోలింగ్ వాహనానికి ఫిర్యాదు రావడంతో పోలీసులు రైడ్ చేసి పట్టుకున్నారు. మెరకముడిదాం మండలం గోపన్నవలసకు ఇసుకను తరలిస్తున్నట్లు తమ విచారణలో తేలినట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. ఇసుకతో ఉన్న లారీని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

జాబ్‌మేళాలో 96 మంది ఎంపిక

బొబ్బిలి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్, ప్రభుత్వ ఐటీఐల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 96 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఈ మేళాకు 303 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు.

పక్కాగా పశుగణన సర్వే

రాజాం సిటీ:

గ్రామాల్లో చేపడుతున్న పశుగణన సక్రమంగా చేపట్టాలని బొబ్బిలి పశుసంవర్ధక శాఖ డీడీ కె.రాజగోపాలరావు అన్నారు. గురవాం గ్రామంలో పశుగణన కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతుల వద్ద ఎన్ని పశువులు ఉన్నాయనేది సరైన సంఖ్య నమోదు చేయడం ద్వారా ఎంత మందులు అవసరమనేది గుర్తించనున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పశు సంఖ్య ఆధారంగానే పాడి రైతులకు సంబంధించిన మందులు, దాణా, సంక్షేమ పథకాలు వంటివి అందించేందుకు వీలుంటుందని అన్నారు. ఏడీ బొత్స జయప్రకాష్, వైద్యాధికారి కె.దీపిక, మోహన్, గురవాన నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

తెర్లాం: గ్రామాల్లో ఉన్న పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఎన్ని ఉన్నాయో తెలుసుకొనేందుకు చేపట్టిన పశు గణనను ఎటువంటి లోపాలు లేకుండా గ్రామ పశు సంవర్ధక శాఖ సహాయకులు చేయాలని బొబ్బిలి పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజగోపాలరావు అన్నారు. తెర్లాంలోని పశువైద్య కేంద్రంలో శుక్రవారం పశు గణన కార్యక్రమంపై మండల పశు వైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

రామభద్రపురం: మండలంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరి వరకు నిర్వహించనున్న 21వ పశు గణన సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని తన పాడి ఆవుల ఫర్మ్ వద్ద పశువైద్యాధికారులు డి.సురేష్, జె.హిరణ్య, ఎ.స్రవంతిలతో కలిసి పశు గణన సర్వేకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, స్టిక్కర్లును ఆయన ఆవిష్కరించారు. ఎల్ఎస్ఏ కె.ప్రశాంత్, జేవీఓ కుమారి, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

బాడంగి: దేశ వ్యాప్తంగా చేపడుతున్న 21వ పశుగణనను మండలంలో పశు వైద్య సిబ్బంది పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ కోరారు. మండలంలోని బొత్సవానివలస రైతుసేవా కేంద్రం వద్ద పశువైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టర్ల ప్రదర్శనలో శుక్రవారం పాల్గొన్నారు. ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీకమాస నిత్యన్నదానం ప్రారంభం

రాజాం: పట్టణ పరిధిలోని కొండంపేట గ్రామంలో శ్రీధర్మ శాస్తా హరిహర సుత అయ్యప్పస్వామి దేవాలయంలో కార్తీకమాస నిత్యన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. 41 రోజుల పాటు అయ్యప్పస్వాములకు ఇక్కడ అన్నప్రసాదం అందిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు శుక్రవారం తెలిపారు.